సాక్షి కామారెడ్డి


మంగళవారం । 25 । మార్చి । 2025



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
38.5 /20.7

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'బెట్టింగ్ చట్టరీత్యా నేరం'



కామారెడ్డి క్రైం : ఐపీఎల్ బెట్టింగ్ చట్టరీత్యా నేరమని ఎస్పీ రాజేశ్ చంద్ర పేర్కొన్నారు. సులభంగా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే అత్యాశ మంచిది కాదన్నారు. ఇది ఎన్నో సమస్యలకు దారి తీస్తుందన్నారు. బెట్టింగ్ కారణంగా అనేక మంది ఆర్థిక ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. ప్రజలు దీనికి దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల ప్రవర్తనపై కన్నేసి ఉంచాలన్నారు. ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

కొనసాగుతున్న ఎస్సెస్సీ పరీక్షలు

కామారెడ్డి టౌన్‌: జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షకు 12,579 మంది విద్యార్థులకుగాను 12,556 మంది హాజరయ్యారు. 23 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల నిర్వహణను డీఈవో రాజు పర్యవేక్షించారు.

'ఫిషరీస్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి'



నిజాంసాగర్: జుక్కల్ నియోజకవర్గంలో ఫిషరీస్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మాట్లాడారు. విద్య, ఉపాధి అవకాశాల కల్పన దిశగా ప్రభుత్వం ముందుకు వెళ్తున్న తరుణంలో జుక్కల్ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ ఫిషరిస్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ మంత్రిని కోరారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో చేప పిల్లల విత్తనోత్పత్తి కేంద్రం ఉందన్నారు. ఇక్కడ ఫిషరీస్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని కోరారు.

మున్సిపాలిటీగా బిచ్కుంద

బిచ్కుందను మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించారు. బిచ్కుంద, గోపన్పల్లి, కందర్‌పల్లి, దౌల్తాపూర్ గ్రామాలను కలుపుతూ బిచ్కుంద మున్సిపాలిటీ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. బిచ్కుంద మండల ప్రజలు, వ్యాపారులు ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావుకు, మంత్రి శ్రీధర్ బాబుకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

'మనిషి నియంత్రణలోనే కృత్రిమ మేధ ఉండాలి'



కామారెడ్డి అర్బన్: కృత్రిమ మేధస్సు (ఏఐ) విద్య, వ్యాపారం, వ్యవసాయం అన్ని రంగాల్లో విస్తరించిందని, మనిషి నియంత్రణలోనే కృత్రిమ మేధ ఉండాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కళాశాల ఫిజికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'కృత్రిమ మేధస్సు ఆగమనం.. సైన్స్ అండ్ టెక్నాలజీ' అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య మాట్లాడారు. వర్క్‌షాప్‌లో సమన్వయకర్తలు విశ్వప్రసాద్, జయప్రకాష్, అధ్యాపకులు రాములు, శ్రీనివాస్‌రావు, మానస, శ్రీవల్లి, రాజశ్రీ, కే.శ్రీనివాస్, స్వామి, రాజు, శ్రీలత, భాగ్యలక్ష్మి, రాంప్రసాద్, అనిల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

155 రకాల వంగడాల ప్రదర్శన

డొంకేశ్వర్(ఆర్మూర్): మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని నగరంలో ఇండియా ఫార్మర్స్ 68వ కౌన్సిల్ సమావేశం సోమవారం నిర్వహించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వెయ్యి మంది రైతులు సమావేశానికి హాజరుకాగా, రాష్ట్రం నుంచి ఐదుగురు పాల్గొన్నారు. ఇందులో జక్రాన్‌పల్లి మండలం చింతలూరుకు చెందిన ఆదర్శరైతు నాగుల చిన్న గంగారాం (చిన్ని కృష్ణుడు) ఉన్నారు. సొంతగా అభివృద్ధి చేసిన 155 రకాల దేశీ వరి వంగడాలను ప్రదర్శనకు ఉంచారు. సమావేశానికి వచ్చిన రైతులు వరి విత్తనాలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం చిన్నికృష్ణుడు ప్రకృతి వ్యవసాయంపై సమావేశంలో ప్రసంగించారు.



ఇక కేస్ క్లోజ్!

జిల్లాలో మూడు నెలల క్రితం సంచలనం

సృష్టించిన మూడు మరణాల కేసు త్వరలో క్లోజ్ అయ్యే అవకాశాలున్నాయి. చెరువులో ముగ్గురి మృతదేహాలు లభించిన ఈ కేసులో సాక్షులు, బాధితులు, నేరస్తులు ఎవరూ లేరు. ముగ్గురూ నీళ్లలో మునిగిపోవడంతో నీళ్లు మింగి చనిపోయినట్లు ఫోరెన్సిక్ నివేదికలు వెల్లడించాయి. ఈ నివేదికతో వీరి మరణానికి ఇతరులెవరూ కారణం కాదనేది స్పష్టమవడంతో త్వరలోనే కేసును క్లోజ్ చేసే అవకాశాలున్నాయి.

- మూడు నెలల క్రితం సంచలనం సృష్టించిన మూడు మరణాలు
- మృతుల్లో ఎస్సై, కానిస్టేబుల్‌తో సహా మరో వ్యక్తి
- నీళ్లు మింగి చనిపోయినట్లు తేల్చిన ఫోరెన్సిక్ నివేదిక
- ఆధారాలు లేని కేసుగా పరిగణిస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా కేంద్రానికి సమీపంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువులో గతేడాది డిసెంబర్ 25న ముగ్గురి మృతదేహాలు లభించిన విషయం తెలిసిందే. మృతులను భిక్కనూరు ఎస్సైగా పనిచేసిన సాయికుమార్, బీబీపేట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసిన శ్రుతి, బీబీపేట గ్రామానికి చెందిన నిఖిల్ అనే యువకుడిగా గుర్తించారు. మృతుల్లో ఎస్సై, కానిస్టేబుల్ ఉండడంతో పోలీస్ ఉన్నతాధికారులు అన్ని కోణాల్లో పరిశీలించారు. కేసును త్వరితగతిన తేల్చాలని భావించినా సరైన ఆధారాలు దొరక్కపోవడంతో సాంకేతిక అంశాలపై ఆధారపడాల్సి వచ్చింది. సంఘటన జరిగిన ప్రాంతంలో ఎక్కడా సీసీ కెమెరాలు లేకపోవడంతో ఎటూ తేల్చలేకపోయారు. మృతులు ముగ్గురు వాడిన సెల్‌ఫోన్లలోని వాట్సాప్ చాటింగ్, వాళ్ల మధ్య జరిగిన సంభాషణలకు సంబంధించిన కాల్ డేటా మాత్రమే కేసులో కొంతమేర పరిశోధనకు ఉపయోగపడినట్టు తెలుస్తోంది.

సాక్షులు, బాధితులు, నిందితులు లేని కేసు..

హత్య, ఆత్మహత్య ఏదైనా సరే కేసులో ఎవరో ఒకరు బాధితులు ఉంటారు. సాక్ష్యాలు కూడా దొరుకుతాయి. అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కేసుల్లో నిందితులను గుర్తించి పట్టుకోగలుగుతున్నారు. అయితే ఈ కేసులో ముగ్గురి మధ్య జరిగిన వ్యవహారం కావడం, ముగ్గురికి ముగ్గురూ ఏకకాలంలో చనిపోవడంతో కేసులో బాధితులు, నేరస్తులు, సాక్షులు ఎవరూ లేకుండాపోయారు. ఇందులో ఎవరో ఇద్దరు చనిపోయి ఉంటే, మూడో వ్యక్తి గురించి ఆరా తీసి కారణాలు తేల్చే అవకాశాలుండేవి. కానీ ముగ్గురూ చనిపోవడంతో సరైన ఆధారాలు దొరక్క పోవడంతో విచారణ ఆలస్యమవుతున్నట్టు తెలుస్తోంది. చెరువు వద్దకు ఎందుకు వెళ్లారు? అక్కడ ఏమైనా గొడవ పడ్డారా? ఎవరు ముందు దూకి ఉంటారు? ఒకరిని కాపాడేందుకు ఒకరి వెంట మరొకరు దూకారా? ఇద్దరు దూకడంతో తమపైకి వస్తుందని మూడో వ్యక్తి కూడా దూకి ఉంటారా? ఇలా ఎన్నో అనుమానాలు వ్యక్తమైనా వాటికి సంబంధించి ఎలాంటి సాక్ష్యాలు, ఆధారాలు దొరకలేదు. ముగ్గురు చనిపోయిన ప్రాంతంలో సీసీ కెమెరాలు లేకపోవడం, ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ ఉన్న దాఖలాలు కూడా లేకపోవడంతో ఆధారాలు, సాక్ష్యాలు లభించే అవకాశాలు కూడా లేవు. కాగా ఫోరెన్సిక్ నివేదికల్లో నీళ్లు మింగడం ద్వారానే మరణం సంభవించినట్లుగా వెల్లడైంది. దీంతో ముగ్గురు నీళ్లలో మునిగిపోవడం వల్లే చనిపోయినట్టు స్పష్టమవుతోంది.

ఎవరూ కారణం కాదు..

ముగ్గురి మరణానికి సంబంధించిన ఈ కేసులో అన్ని కోణాల్లో దర్యాప్తు జరిపిన పోలీసులు వాళ్ల చావులకు మరెవరూ కారణం కాదని, వాళ్లకు వాళ్లుగానే చనిపోయినట్టు నిర్ధారణకు వచ్చారు. ఇప్పటికే మూడు నెలలు గడిచింది. కేసు వివరాల నివేదికను రూపొందించి కోర్టుకు, అలాగే మృతుల బంధువులకు అప్పగించి కేసును క్లోజ్ చేయడమే మిగిలిందని పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన ఈ కేసును త్వరలోనే క్లోజ్ చేసే అవకాశాలున్నాయి.

బాన్సువాడ గడ్డ.. బీఆర్‌ఎస్ అడ్డా

- ప్రస్తుత ప్రభుత్వం రంజాన్ తోఫా ఇవ్వడం లేదు
- ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ కవిత

బాన్సువాడ: బాన్సువాడ గడ్డ బీఆర్‌ఎస్ అడ్డా అని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. సోమవారం బాన్సువాడ పెద్ద మజీద్ వద్ద నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో ముస్లింల కోసం షాదీముబారక్ పథకం ప్రవేశపెట్టామన్నారు. రంజాన్ పండుగను అధికారికంగా నిర్వహించి పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశామని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రంజాన్ తోఫా ఇవ్వడం లేదని విమర్శించారు. విదేశాల్లో చదివే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వ సలహాదారుగా ఉన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. నాయకులు వస్తారు.. పోతారని, కానీ కార్యకర్తలు మాత్రం ఎప్పటికీ ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, బీఆర్‌ఎస్ నాయకులు ఆయెషాబేగం, సుమిత్ర, జుబేర్, కిషన్, మోచీ గణేష్, గౌస్, సాయిబాబా, సాయిలు, శివ, రమేష్‌యాదవ్ తదితరులు ఉన్నారు.



బాన్సువాడలో ఇఫ్తార్ విందులో ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

మళ్లొచ్చేది మన ప్రభుత్వమే

నిజాంసాగర్: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గెలిచేది బీఆర్‌ఎస్ పార్టీనేనని, వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. సోమవారం బాన్సువాడ పట్టణంలో నిర్వహించే ఇఫ్తార్ విందులో పాల్గొనేందుకు వెళ్తున్న ఎమ్మెల్సీ కవితకు మండల బీఆర్‌ఎస్ నాయకులు నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల ఉత్సాహం చూస్తే ఎన్నికలు ఏవైనా బీఆర్‌ఎస్ ప్రభంజనం తప్పదన్న అభిప్రాయం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దుర్గారెడ్డి, విఠల్, రమేశ్‌గౌడ్, రమేశ్, విఠల్‌గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, రాములు, సుభాష్‌గౌడ్ పాల్గొన్నారు.



నర్సింగ్‌రావుపల్లి చౌరస్తా వద్ద కవితకు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

సలాబత్‌పూర్ ఆలయ కమిటీ నియామకం

మద్నూర్: సలాబత్‌పూర్‌లోని హనుమాన్ ఆలయ నూతన కమిటీని ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. చైర్మన్‌గా పెద్ద శక్కర్గాకు చెందిన రాంపటేల్, ధర్మకర్తలుగా ఉష్కల్ శ్రీనివాస్, తోటవార్ నాగ్‌నాథ్, కుషాల్‌రావ్, పటేల్ పండరి, కాకాని కైలాష్, రామస్వామి లక్ష్మీబాయిలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను దేవాదాయ ధర్మాదాయ శాఖకు పంపించినట్లు ఆలయ అధికారులు తెలిపారు

తాగునీటి మానిటరింగ్ సెల్ ఏర్పాటు

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే వెంటనే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన తాగునీటి మానిటరింగ్ సెల్‌కు సమాచారం ఇవ్వాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మానిటరింగ్ సెల్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాగు నీటి సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో ప్రత్యేక సెల్ ను ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే 99087 12421 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ మానిటరింగ్ సెల్ రోజూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తుందని తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను నమోదు చేసుకుని సంబంధిత శాఖల అధికారుల ద్వారా సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీపీవో మురళి, సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మానిటరింగ్ సెల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

రేపు కలెక్టర్‌తో 'సాక్షి' ఫోన్‌ఇన్

జిల్లాలో తాగునీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపేందుకు 'సాక్షి' బుధవారం ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. ప్రజలు నిర్దేశిత సమయంలో ఫోన్ చేస్తే కలెక్టర్ సమాధానమిస్తారు.

తేది : 26-03-2025 (బుధవారం)

సమయం : ఉదయం 12.00 నుంచి 1.00 గంట వరకు..



ఫోన్ చేయాల్సిన నంబర్: **99087 12421**

మత్తు పదార్థాలను నిర్మూలించాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : నిషేధిత మత్తు పదార్థాల నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసు, విద్య, వైద్య ఆరోగ్య, ఎక్సైజ్, వ్యవసాయ, డ్రగ్స్ నియంత్రణ, అటవీ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ మాదక ద్రవ్యాలు సరఫరా కాకుండా చూడాలన్నారు. జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలలో యాంటీ డ్రగ్స్ కమిటీలను వేశామన్నారు. మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలపై విద్యార్థులకు క్విజ్, ఉపన్యాసం, వ్యాస రచన పోటీలను నిర్వహించాలని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వారికి వైద్యం అందించడానికి కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రత్యేక సదుపాయం ఉందన్నారు. దానిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గంజాయి సాగు జరగకుండా వ్యవసాయ అధికారులు, అటవీశాఖ అధికారులు చూడాలన్నారు.

5 కేసులు నమోదు చేశాం

జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 5 గంజాయి కేసులను నమోదు చేశామని ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్, బిచ్కుంద, భిక్కనూరు, దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌ల పరిధిలో కేసులు నమోదు అవుతున్నాయన్నారు. వ్యసనాలకు, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. జిల్లాలోని కల్లు దుకాణాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని పోలీసులకు సూచించారు. ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ఎక్సైజ్, పోలీసు శాఖల అధికారులు కలిసి కల్లు దుకాణాల్లో తనిఖీలు చేయాలన్నారు. కల్లు శాంపిళ్లు సేకరించి ల్యాబ్ లకు పంపాలని, అల్ప్రాజోలం ఉన్నట్లు గుర్తిస్తే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. డ్రగ్స్ సమాచారం తెలిస్తే 87126 86133 నంబర్‌కు గానీ టోల్ ఫ్రీ నంబర్ 1908 కి గానీ సమాచారం ఇవ్వాలని కోరారు. డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయించినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం యాంటీ డ్రగ్స్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. సమావేశంలో ఏఎస్పీ చైతన్యరెడ్డి, డీటీవో శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో రాజు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హన్మంతరావు, డీఏవో తిరుమల ప్రసాద్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి, ఇంటర్ బోర్డు నోడల్ అధికారి షేక్ సలాం, సీడబ్ల్యూసీ సభ్యురాలు స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర, అధికారులు

చి'వరి'కి మేతగా..

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- నీరందక ఎండిపోతున్న పంటలు
- ఆవిరవుతున్న అన్నదాతల ఆశలు


దోమకొండ : ఎండలు మండుతుండడంతో భూగర్భ జలాలు పడిపోతున్నాయి. దీంతో బోరుబావులు ఎత్తిపోయి పంటలు ఎండుతున్నాయి. మండలంలో చాలాచోట్ల ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉంది. ఈ దశలో పంటకు నీరు ఎక్కువగా అవసరం. పంట చేతికి అందాలంటే మరో నెలపాటు సాగు నీరు అందాలి. అయితే బోరుబావులు ఎత్తిపోతుండడంతో పంటను ఎలా కాపాడుకోవాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. చేసేదేమీ లేక పలుచోట్ల ఎండుతున్న పంటను వదిలేస్తున్నారు. దోమకొండ మండలంలో 10 వేల ఎకరాల్లో వరి సాగుచేశారు. ఇప్పటికే నీరందక సుమారు వెయ్యి ఎకరాల్లో పంట ఎండిపోయిందని రైతులు పేర్కొంటున్నారు. దీంతో ఎండిన పంటను కొందరు రైతులు పశువులకు మేతగా వాడుతున్నారు.

బెజుగం చెరువుతండాలో..

నాగిరెడ్డిపేట:భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో పంటలు ఎండిపోతున్నాయి. దీంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఎండలు ముదురుతుండడంతో బెజుగం చెరువుతండాలో బోరుబావుల్లో ఊట తగ్గిపోతోంది. కొన్ని బోర్లు ఎత్తిపోయాయి. దీంతో నీరందక పంటలు ఎండుముఖం పట్టాయి. చేతికొచ్చే దశలో పంటలు ఎండుతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తండాలో సుమారు 40 ఎకరాలలో పంట ఎండిపోయిందని రైతులు తెలిపారు. చేసేదేమీ లేక ఎండిన పంటలో పశువులను మేపుతున్నామని పేర్కొన్నారు.



దోమకొండలో ఎండిన వరి పొలంలో మేకలను మేపుతున్న రైతులు



బెజుగంచెరువుతండాలో ఎండిపోయిన పంటను మేస్తున్న పశువులు

విద్యార్థులకు పరీక్షే!

- గురుకులం నుంచి పరీక్ష కేంద్రానికి రవాణా వసతి కరువు
- ట్రాలీ ఆటోలో ప్రమాదకర ప్రయాణం
- ఒక్కో ట్రిప్‌లో 38 మందిని తరలిస్తున్న వైనం

నిజాంసాగర్: పదో తరగతి పరీక్ష కేంద్రానికి వెళ్లడం అచ్చంపేట ఎస్సీ గురుకుల విద్యార్థులకు అగ్ని పరీక్షగా మారింది. రవాణా సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అచ్చంపేట ఎస్సీ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు 76 మంది ఉన్నారు. వీరికి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న నిజాంసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను కేటాయించారు. అక్కడికి వెళ్లి రావడానికి రవాణా సౌకర్యం లేకపోవడంతో గురుకుల అధికారులు ట్రాలీ ఆటోలో పంపిస్తున్నారు. 38 మంది చొప్పున రెండు ట్రిప్పుల్లో వెళ్లి వస్తున్నారు. ట్రాలీతోపాటు టాప్‌పైనా కొందరు విద్యార్థులు కూర్చుని ప్రయాణిస్తున్నారు. పరీక్ష అనంతరం గురుకులానికి తిరిగి వచ్చే సమయంలో ఎండ తీవ్రంగా ఉంటోంది. మండుటెండలో ప్రయాణించాల్సి రావడంతో అసౌకర్యానికి గురవుతున్నారు. సరైన రవాణా సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.



పదోతరగతి పరీక్ష రాసి ట్రాలీ ఆటోలో గురుకులానికి వెళ్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి



మద్నూర్(జుక్కల్) : విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని ట్రాన్స్‌కో డీఈ గంగాధర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం మూడు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌లను ఆయన ప్రారంభించారు. ఈ ప్రాంతంలో అధిక లోడ్ ఉండడంతో వోల్టేజ్ సమస్య వస్తుండడం, వేసవికాలంలో విద్యుత్ వినియోగం ఎక్కువగా అవసరం ఉండడంతో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశామన్నారు. ట్రాన్స్‌కో ఏడీఈ సంజీవన్‌రావ్, ఏఈ గోపికృష్ణ, సిబ్బంది స్వామి ఉన్నారు.

పాఠశాలల అభ్యున్నతికి సహకారం



నిజాంసాగర్(జుక్కల్): పాఠశాలల అభ్యున్నతికి తల్లిదండ్రులు, గ్రామస్తులు, స్వచ్ఛంద సంస్థలు తమవంతు సహకారం అందించాలని పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్ పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని మాగి గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మైల్ స్టోన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మార్కెట్ కమిటీ చైర్మన్ చేతుల మీదుగా విద్యార్థులకు బ్యాగులు, సోలార్ బల్బులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుర్రపు. శ్రీనివాస్ పటేల్, శేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షమీన, ఉపాధ్యాయులు ప్రవళిక, శైలజ తదితరులు ఉన్నారు.

గ్రంథాలయానికి కుర్చీలు అందజేత



బాన్సువాడ : బాన్సువాడ గ్రంథాలయానికి కుర్చీలు, ప్యాడ్‌లను సోమవారం బీజేపీ నియోజకవర్గ నాయకులు శ్రీనివాస్ గార్గె అందజేశారు. మినీ స్టేడియంలో కొనసాగుతున్న గ్రంథాలయంలో చదువుకునే వారి సౌకర్యం కోసం చల్లటి వాటర్ ట్యాంకుతో పాటు 20 కుర్చీలు, 20 ప్యాడ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయం భవన నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరైనప్పటికి పనులు ప్రారంభించడం లేదని అన్నారు.కార్యక్రమంలో నాయకులు అర్షపల్లి సాయిరెడ్డి, ర్యాల మోహన్‌రెడ్డి, దావుగారి డాకయ్య, ప్రసాద్, రాజాసింగ్, సాయికిరణ్, బోడ లక్ష్మణ్, శ్యాంకుమార్ తదితరులు ఉన్నారు.

ఏవో విజయ్‌కుమార్ మరణం తీరని లోటు



బాన్సువాడ : పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవోగా పని చేసి బదిలీపై వెళ్లిన విజయ్‌కుమార్ మరణం తీరని లోటు అని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో విజయ్‌కుమార్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహచర అధికారులతో కలుపుగోలుపుగా ఉండే విజయ్‌కుమార్ మృతి బాధకరమన్నారు. రెండు రోజుల క్రితమే ఎల్లారెడ్డి డివిజన్ కార్యాలయానికి బదిలీ అయ్యారని గుర్తు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్, రెవిన్యూ అధికారులు సంగమేశ్వర్, అశోక్, ఆంజనేయులు, భాస్కర్ తదితరులున్నారు.

ఆకట్టుకున్న కుస్తీపోటీలు



బాన్సువాడ రూరల్: మండలంలోని కొల్లూర్ గ్రామంలో సోమవారం నిర్వహించిన కుస్తీపోటీలు ఆకట్టుకున్నాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన మల్లయోధులు తమ ప్రతిభను చాటి బహుమతులు అందుకున్నారు. గ్రామంలో ప్రతి ఏటా పాడిపంట, ప్రజలు బాగుండాలని జాతర మహోత్సవం నిర్వహిస్తామని గ్రామకమిటీ అధ్యక్షులు పరిగె బాపురెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సంజీవ్ రెడ్డి, సాయిలు, పర్వయ్య, దుర్గారెడ్డి, శ్రీనివాస్, వీరేందర్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 131 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 131 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో భూ సంబంధిత, డబుల్ బెడ్రూం ఇళ్లు, పింఛన్‌లకు సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు ప్రజావాణిలో 20,370 ఫిర్యాదులు రాగా 19,567 ఫిర్యాదులను పరిష్కరించమన్నారు. 803 వినతులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వినతులను పరిష్కరించడం గానీ, పరిష్కార మార్గాలు చూపడం గానీ చేయాలన్నారు. ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టరాదన్నారు. తీసుకున్న చర్యలకు సంబంధించిన సమాచారాన్ని ఫిర్యాదుదారునికి తప్పనిసరిగా అందజేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో వీణ, జెడ్పీ సీఈవో చందర్, ఏవో మస్రూర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీటి డ్రమ్ములకు డిమాండ్



రామారెడ్డిలో డ్రమ్ములను కొనుగోలు చేస్తున్న గ్రామస్తులు

- వేసవిలో నీళ్లు నింపుకోవడానికి..
- ఒక్కటి రూ. వెయ్యిపైనే

రామారెడ్డి : వేసవికాలంలో నీటి డ్రమ్ములకు డిమాండ్ పెరిగింది. కుళాయి నీళ్లు వచ్చినప్పుడు నింపుకొని ఆదా చేయడానికి మహిళలు కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు డ్రమ్ములను ఆటోల్లో తీసుకొచ్చి గ్రామాల్లో విక్రయిస్తున్నారు. ఒక్కో డ్రమ్ము ధర రూ.1000 నుంచి రూ.1200 గా నిర్ణయించారు. రోజూ 50 డ్రమ్ములు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

మొరం తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి



జిల్లాలో జరుగుతున్న అక్రమమొరం తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం జిల్లా కమిటీ నాయకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కమిటీ ప్రతినిధులు వెంకటి గౌడ్, కొత్తనరసింహులు మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల పరిధిలో మొరం అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయన్నారు. సంబంధిత అధికారులు మొరం వ్యాపారులతో కుమ్మక్కైపోయారని ఆరోపించారు. ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. వ్యాపారులకు సహకరిస్తున్న అధికారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఆలయ భూమి కబ్జాకు యత్నిస్తున్నారు



భిక్కనూర్‌లోని పోచమ్మ ఆలయ ప్రాంగణంలో ఉన్న భూమిని గ్రామానికి చెందిన మరో వర్గం వారు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. వారు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఆలయంలో ప్రత్యేక పూజలు, బోనాలు, ఎడ్ల బండ్ల ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆలయం ముందర ఉన్న మర్రి చెట్టును నరికి వేసి ఆ స్థలాన్ని కబ్జా చేయాలనే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఆలయ భూమికి రక్షణ కల్పించి సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వారు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, నాయకులు మురళి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 12,750 గ్రామపంచాయతీలలో 60వేల మందికి పైగా కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని, ఆరు నెలలుగా వారికి జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్‌గా రూ.5లక్షల ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగుల తరహా 30 శాతం పీఆర్సీ అమలు చేయాలని, జీవో నెంబర్ 51సవరించి మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పంచాయతీ కార్మికులకు జీవో నెంబర్ 60ప్రకారంగా రూ.16,500 వేతనాన్ని ఇవ్వాలన్నారు. నాయకులు అరవింద్, రాజేశ్వర్, సత్యమ్మ, కార్మికులు మహేష్, రాము, చింటూ, సురేష్, బాలు, నరేష్, గంగాధర్, భోజన్న, నరేష్, శ్రీకాంత్, రమేష్, లింగం, రాజేశ్వర్, సాయిలు, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ ఆవశ్యకతను తెలియపర్చాలి

- కాంగ్రెస్ ఓబీసీ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కత్తి వెంకటస్వామి



రాజ్యాంగంపై ప్రమాణం చేస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ శ్రేణులు రాజ్యాంగ ఆవశ్యకతను తెలుపుతూ ప్రజలను చైతన్యవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కత్తి వెంకటస్వామి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌పార్టీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. హోం మంత్రి అమిత్‌షాను పార్లమెంట్ నుంచి బర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతూ మహాత్మా గాంధీ చిత్రపటంతో ఊరూర పాదయాత్రలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని నాయకులచే ప్రమాణం చేయించారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిరిజన శాఖ కార్పొరేషన్ చైర్మన్ కొట్నక తిరుపతి, ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజ్, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, కారంగుల అశోక్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, పండ్ల రాజు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తీర్మానం



పిట్లం(జుక్కల్): మండలంలోని చిన్నకొడప్‌గల్ ప్రాథమిక సహకార సంఘం వద్ద సోమవారం చైర్మన్ నాగిరెడ్డి అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. సహకార సంఘం కార్యదర్శి హన్మండ్లు ఆదాయ వ్యయాలను చదివి వినిపించారు. చైర్మన్ మాట్లాడుతూ సహకార సంఘం పరిధిలో జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అర్హులైన రైతులకు రుణాలు వర్తింపజేయాలని తదితర తీర్మానాలు చేశామన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్లు, సిబ్బంది, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

అధ్యాపకులను వెంటనే రిలీవ్ చేయాలి

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ మూల్యాంకనంలో హాజరయ్యే అధ్యాపకులను ఆయా కళాశాలలు వెంటనే రిలీవ్ చేయాలని ఇంటర్ విద్యాశాఖ అధికారి తిరుమలపూడి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26 నుంచి నుంచి ఇంటర్ బోటని, జువాలజీ, కామర్స్, హిస్టరీ, కెమిస్ట్రీ సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభమవుతుందన్నారు. మూల్యాంకనం చేసే అధ్యాపకుల ఆర్డర్ కాపీలను ఇంటర్ బోర్డు ఆయా కళాశాలల లాగిన్లలో నిక్షిప్తం చేసినట్లు తెలిపారు. వెంటనే తమ అపాయింట్మెంట్ ఆర్డర్లను డౌన్లోడ్ చేసుకొని 26వ తేదీన ఉదయం పది గంటలకు నిజామాబాద్ ఖిల్లా బాలుర జూనియర్ కళాశాల వద్ద మూల్యాంకన కేంద్రంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఆయా కళాశాలలు సంబంధిత అధ్యాపకులను రిలీవ్ చేయకుంటే ఇంటర్‌బోర్డు ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నాట్ అపాయింట్‌మెంట్ లిస్టులో ఉన్న అధ్యాపకులను కూడా మూల్యాంకనం విధుల్లోకి తీసుకుంటామని తెలిపారు.

క్రైం కార్నర్

రేషన్ బియ్యం పట్టివేత



ఖలీల్‌వాడి: నగరంలోని వీక్లీ మార్కెట్‌లో సాయికిరణ్ అనే వ్యక్తి దుకాణంలో రేషన్ బియ్యంను టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పట్టుకున్నారు. సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి అడిషనల్ డీసీపీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారు దుకాణంపై దాడి చేసి, 20 క్వింటాళ్ల రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. లక్ష ఉంటుందని, తదుపరి చర్య నిమిత్తం వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వోకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య తెలిపారు. ఎస్సై గోవింద్, స్పెషల్ పార్టీ సిబ్బంది ఉన్నారు.

వన్నెల్(బి)లో మొరం టిప్పర్లు..

బాల్కొండ: మండలంలోని వన్నెల్(బి) శివారులో వరద కాలువ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు టిప్పర్లను సోమవారం బాల్కొండ పోలీసులు పట్టుకున్నారు. టిప్పర్లను, పొక్లెయిన్‌ను బాల్కొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

కుక్కల దాడిలో 18 గొర్రెలు మృతి



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని వెల్లుట్లపేట గ్రామంలో కుక్కల దాడిలో 18 గొర్రెలు మృతి చెందినట్లు గ్రామస్తులు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన కొర్వి నారాయణ గ్రామ శివారులో గొర్రెలను మేపుతుండగా అకస్మాత్తుగా కుక్కల గుంపు గొర్రెలపై దాడి చేయడంతో మృత్యువాత పడ్డాయని తెలిపారు. మృతి చెందిన 18 గొర్రెల విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. అధికారులు స్పందించి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

పేకాడుతున్న 8మంది అరెస్టు

బోధన్: సాలూర మండల కేంద్రంలో పేకాడుతున్న 8మందిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తెలిపారు. సాలూరలోని పంటపొలాల్లో గల పేకాట స్థావరంపై సోమవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి అడిషనల్ డీసీపీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, ఎస్సై గోవింద్, సిబ్బంది దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న 8మందిని పట్టుకున్నట్లు తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి 9 సెల్‌ఫోన్‌లు, సుమారు రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తదుపరి చర్యల కోసం బోధన్ రూరల్ ఎస్సైకి అప్పగించినట్లు వెల్లడించారు.

కరెంట్ షాక్‌తో రైతు మృతి

- ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న గ్రామస్తులు
- సబ్‌స్టేషన్‌లోనే మృతదేహాన్ని ఉంచిన వైనం
- రాంపూర్‌గడ్డ తండాలో ఘటన



స్తంభంపై కరెంట్ షాక్‌కు గురైన శ్రీను

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని రాంపూర్ గడ్డ తండాలో కరెంటు షాక్‌తో ఓ రైతు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. వివరాలు ఇలా.. తండాకు చెందిన పిట్ల శ్రీను(30) అనే రైతు సోమవారం సాయంత్రం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతుల కోసం పోతంగల్ కలాన్ సబ్‌స్టేషన్ నుంచి ఎల్సీ తీసుకుని పనులు చేపట్టాడు. కానీ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి అతడు కిందికి రాకముందే అధికారులు కరెంటు సరఫరా చేశారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉన్న శ్రీను కరెంట్ షాక్‌కు గురయ్యాడు. స్థానికులు గమనించి వెంటనే అతడిని 108 అంబులెన్సులో చికిత్స నిమిత్తం బాన్సువాడ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. దీంతో ఆగ్ర హించిన గ్రామస్తులు మృతదేహాన్ని పోతంగల్ కలాన్ స్టేజి వద్ద ఉంచి ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనను విరమింప జేశారు. మృతదేహాన్ని సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద ఉంచారు. సబ్‌స్టేషన్ సిబ్బంది నిర్లక్ష్యంతోనే రైతు మృతి చెందాడని, ఉన్నతాధికారులు వచ్చేంత వరకు మృతదేహాన్ని అక్కడే ఉంచుతామని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



దగ్ధమైన రేకుల ఇల్లు

రుద్రూర్: పోతంగల్ మండలం కల్లూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి ఇల్లు దగ్ధమైంది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా. కల్లూర్ గ్రామానికి చెందిన బీర్కూర్ గంగారాం కుటుంబ సభ్యులు రేకుల ఇంట్లో జీవనాన్ని కొనసాగిస్తున్నారు. సోమవారం ఉదయం వారు ఇంట్లో పూజాకార్యక్రమాలు ముగించుకుని ఇంటికి తాళం వేసి, వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లిపోయారు. కొద్దిసేపటికి ఇంట్లో నుంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి గంగారాంకు సమాచారం అందించారు. వెంటనే బాధిత కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో మంటలు ఆర్పివేసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది. ఇల్లు నిర్మించుకునేందుకు అప్పుగా తెచ్చుకున్న నగదుతోపాటు, బీరువాలోని బంగారం, వెండి ఆభరణాలు, బట్టలు, వంట సామగ్రి, ఫర్నిచర్ అగ్నికి ఆహుతయ్యాయి. రెవెన్యూ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని రూ.మూడు లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. పూజ కోసం వెలిగించిన దీపం కింద పడిపోవడంతో మంటలు అంటుకుని ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ముందుకొస్తున్న ఆపన్నహస్తాలు



డొంకేశ్వర్(ఆర్మూర్): లుకేమియా (బ్లడ్ క్యాన్సర్)తో బాధపడుతున్న డొంకేశ్వర్ మండలం గంగాసముందర్ గ్రామానికి చెందిన నిర్విన్ తేజ్ ప్రాణాలను కాపాడేందుకు ఆపన్నహస్తాలు ముందుకొస్తున్నాయి. తొండాకూర్ గ్రామానికి చెందిన షేక్ సలీం బాలుడి వైద్య ఖర్చుల కోసం రూ.30వేల చెక్కును సోమవారం అందజేశారు. గంగాసముందర్ గ్రామానికి చెందిన యువత సైతం ముందుకొచ్చి తోచిన ఆర్థిక సాయాన్ని అందజేశారు. నిర్విన్ తేజ్ చదువుతున్న తొండాకూర్ ఎస్ఎస్‌వీ పాఠశాల యాజమాన్యం సైతం విరాళాలు సేకరిస్తోంది. నిర్విన్ తేజ్ ఆరోగ్య పరిస్థితిని వివరిస్తూ 'సాక్షి'లో 'పాపం బాలుడిని ఆదుకోరూ' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించి చాలా మంది తమ వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: నిజామాబాద్ నగర శివా రులోని నాగారం గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ బోధించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సైదా జైనబ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, పీహెచ్‌డీ, నెట్ లేదా సెట్ ఉత్తీర్ణులైన మహిళా అభ్యర్థులు ఈ నెల 27 వరకు గురుకులంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. ఇది పూర్తి తాత్కాలిక పద్ధతిలో జరిగే నియామకమని, 28న డెమో ఆధారంగా ఎంపిక ఉంటుందని తెలిపారు. పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యతనిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యతోపాటు క్రీడలకు ప్రోత్సాహం



తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర ప్రభుత్వం విద్యతోపాటు క్రీడలకు సమ ప్రాధాన్యతను ఇస్తుందని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు. తెయూలో సోమవారం తెలంగాణ యూనివర్సిటీ యాన్యువల్ డే-2025 స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా బాలుర కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీలో విద్యతోపాటు క్రీడలను, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నామని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెయూ స్పోర్ట్స్ డైరెక్టర్ బాలకిషన్, పీఆర్‌వో పున్నయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ బీఆర్ నేత తదితరులు పాల్గొన్నారు. కబడ్డీ తొలి పోరులో ఎంఎస్సీ కెమిస్ట్రీ జట్టు-అప్లయిడ్ ఎకనామిక్స్ జట్టు తలపడగా అప్లయిడ్ ఎకనామిక్స్ జట్టు విజయం సాధించింది. రెండవ పోరులో అప్లయిడ్ ఎకనామిక్స్ జట్టు, మాస్ కమ్యూనికేషన్ జట్టు తలపడగా మాస్ కమ్యూనికేషన్ జట్టు విజయం సాధించింది.

31లోపు పరీక్ష ఫీజు చెల్లించండి

నిజామాబాద్‌అర్బన్: గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2వ, 4వ, 6వ డిగ్రీ రెగ్యులర్ సెమిస్టర్ పరీక్షలకు, 1 నుంచి 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు ఈనెల 31లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రిన్సిపల్ రామ్మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100తో అపరాధ రుసుంతో ఏప్రిల్ 4లోపు, రూ.500 అపరాధ రుసుంతో ఏప్రిల్ 6లోపు చెల్లించడానికి అవకాశం ఉందన్నారు. రూ.1000 అపరాధ రుసుంతో ఏప్రిల్ 7వరకు ఫీజు చెల్లించవచ్చునన్నారు. పరీక్ష ఫీజును ఆన్‌లైన్‌లో మాత్రమే చెల్లించాలన్నారు.

వర్నిలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

- 20మందిపై కేసు నమోదు



వర్నిలో ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

వర్ని: మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి కాంగ్రెస్ పార్టీ లో రెండు వర్గాలు ఘర్షణ పడినట్లు వర్ని ఎస్సై మహేష్ వెల్లడించారు. మండల కేంద్రంలో ఒక టీ పాయింట్ వద్ద చిన్నపాటి గొడవ ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టి ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పారు. ఘర్షణకు పాల్పడ్డ ఇరువర్గాలకు చెందిన 20మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. అలాగే వర్నిలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

18మందిపై కేసు నమోదు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని ఉత్తునూర్ గ్రామంలో ఇటీవల చోరీకి యత్నించిన దుండగుడిపై గ్రామస్తులు దాడి చేయగా, తీవ్ర గాయాలు కావడంతో మృతిచెందాడు. ఈ ఘటనలో పోలీసులు 18మందిపై కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా.. ఉత్తునూర్ గ్రామానికి చెందిన తూర్పు రజనీకాంత్(33) బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే నివాసం ఉంటున్నాడు. పని నిమిత్తం స్వగ్రామానికి ఈ నెల 18న రాగా, అర్ధరాత్రి స్థానికంగా ఉన్న హనుమాన్ మందిరంలో చోరీకి యత్నించాడు. గమనించిన గ్రామస్తులు అతడిని పట్టుకొని దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన రజనీకాంత్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు.

మృతుడి తల్లి సత్యబాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సాంకేతికతను ఉపయోగించుకొని 18మంది గ్రామస్తులను పోలీసులు గుర్తించి, వారిపై కేసులు నమోదుచేశారు. సోమవారం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.